## నల్లవెల్లిలో సహకార్ సే సమృద్ధి..

### మొక్కలు నాటిన పాలకవర్గం

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి సహకార సంఘం చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సహకార్ సే సమృద్ధి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు సహకార సంఘం పరిధిలోని వివిధ గోదాముల వద్ద మొక్కలు నాటి వాటి సంరక్షణకు కావలసిన చర్యలను తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు ప్రతి సహకార సంఘం పరిధిలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశాల మేరకు మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొక్కల సంరక్షణ భవిష్యత్తు రక్షణ గా ఉంటుందన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే పెద్దల నానుడిని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి సహకార సంఘం వైస్ చైర్మన్ రమేష్, సీఈవో తేజ గౌడ్, సర్పంచ్ రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరెడ్డి, గంగారెడ్డి, పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి

### ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ (జనరల్) రమేష్, ఈఎన్సీ (అడ్మిన్) శ్రీనివాస్‌తో కలిసి హైదరాబాద్లోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రభావిత భూములకు నష్టపరిహారం..సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపు ప్రభావిత భూములకు నష్టపరిహారం చెల్లించి అవసరమైన అనుమతులు పొందేందుకు మే నెలలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రూ.55.30 కోట్లను మంజూరు చేసిందని పోచారం తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవో నెం.37ను ఈనెల 8న ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగేందుకు భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నష్టపరిహారం చెల్లింపులు పారదర్శకంగా, సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే పనుల ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేలో పాల్గొన్న కోఆప్షన్ సభ్యులు

### కాసుల రోహిత్, ఖామర్ సుల్తానా గౌస్ పాషా

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎసిఐఆర్) కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ మున్సిపాలిటీలో ఇంటింటి సర్వే నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని టీచర్ కాలనీ 13వ వార్డులో స్థానిక బి.ఎల్.ఏ ఏజెంట్లతో కలిసి కోఆప్షన్ సభ్యులు కాసుల రోహిత్, ఖామర్ సుల్తానా గౌస్ పాషా ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఓటరు వివరాలను పరిశీలిస్తూ, జాబితాలో నమోదైన సమాచారాన్ని ధృవీకరించారు.ప్రజల ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని అన్నారు .ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ.. ఓటు హక్కు ఎంతో ప్రాముఖ్యత అని ప్రతి ఒక్కరు హక్కు అని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఈ కార్యక్రమంలో పాల్గొని బిఎల్ఓ ల నుండి నమోదు పత్రాలను తీసుకొని వివరాలను వెల్లడించాలని, చదువుకున్న వారైతే ఆ పత్రాలను నింపి బిఎల్ఓ లకు సకాలంలో బిఎల్ఓ లకు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు వాణి, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

# సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించి బెల్లం కేంద్రంగా ప్రభుత్వమే నిర్వహించాలి

### చెరుకు ఉత్పత్తి దారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మూతపడిన ఎన్ సిఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించి, దానిని బెల్లం ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేసి ప్రభుత్వమే నిర్వహించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా వాసి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆకుల పాపయ్య మాట్లాడుతూ, ఒకప్పుడు లాభాలతో నడిచిన ఎన్ సిఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ వల్ల రైతులు గణనీయమైన ఆర్థిక లాభాలు పొందారని చెప్పారు. రైతుల పిల్లల విద్య, గృహ నిర్మాణం, వివాహాలు వంటి అనేక అవసరాలకు ఈ ఫ్యాక్టరీ ఆదాయ వనరుగా నిలిచిందని గుర్తు చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వ చక్కెర విధానాలు, అవినీతి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫ్యాక్టరీ నష్టాలోకి వెళ్లి మూతపడిందని ఆరోపించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ ప్రాంతంలోని సుమారు 80 గ్రామాల రైతులు తిరిగి చెరుకు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, రైతులకు గిట్టుబాటు ధర, ఉచిత విత్తనాలు అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విత్తన ఉత్పత్తికి అనుకూలమైన నేలలు ఉన్నాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని, శనగ, వేరుశెనగ, సోయాబీన్, వరి తదితర పంటల విత్తనాల ఉత్పత్తి కేంద్రంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని, అలాగే గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసిన విత్తనాల బకాయిలు సుమారు రూ.450 కోట్లను వెంటనే సంబంధిత సంస్థకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో లక్షలాది కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయని, పచ్చిమేత అభివృద్ధి కోసం గతంలో ఉన్న వెటర్నరీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పోస్టును పునరుద్ధరించి నియామకం చేపట్టాలని కోరారు. అలాగే పాడి రైతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మత్స్యకారులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించి, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. అదేవిధంగా పులాంగ్ వాగు అభివృద్ధిలో భాగంగా మాసాని నుంచి పాల్ద, జన్నేపల్లి వరకు వాగుకు ఇరువైపులా కరకట్టలు నిర్మిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్యతో పాటు నాయకులు కొట్టే గంగాధర్, టేక్మాల్ లక్ష్మణ్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2 నుంచి లింగాపూర్ బ్రిడ్జి 25 రోజుల పాటు మూసివేత

### ఇందల్వాయి నుంచి ధర్పల్లి వెళ్లే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి

### మరమ్మతు పనుల నేపథ్యంలో సివిల్ కాంట్రాక్టర్ వెల్లడి

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలం పరిధిలోని లింగాపూర్ బ్రిడ్జి కి అత్యవసర మరమ్మతులు నిర్వహించాల్సి ఉన్నందున, గురువారం (జూలై 2) నుండి 25 రోజుల పాటు బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు సివిల్ కాంట్రాక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. లింగాపూర్ బ్రిడ్జి మూసివేత కారణంగా ఇందల్వాయి నుండి ధర్పల్లి వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. ప్రయాణికులు రాంపూర్ లోలం, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మీదుగా ధర్పల్లికి చేరుకోవాలని కోరారు.

సహకరించాలని విజ్ఞప్తి:బ్రిడ్జి మరమ్మతు పనులు వేగంగా పూర్తి కావడానికి వాహనదారులు, స్థానిక ప్రజలు సహకరించాలని, నియోజకవర్గ, మండల ప్రయాణికులు ఈ తాత్కాలిక మార్పును గమనించి తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని కాంట్రాక్టర, స్థానిక యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఉద్యోగ విరమణ చేసిన అదనపు కలెక్టర్ కు ఘనంగా వీడ్కోలు

### కలెక్టరేట్‌లో అట్టహాసంగా సన్మాన మహోత్సవం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా విధులు నిర్వర్తిస్తూ, మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఎస్.కిరణ్ కుమార్ కు ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సమీక్షత్ జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సన్మాన మహోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉద్యోగ విరమణ చేస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. అదనపు కలెక్టర్ గా కిరణ్ కుమార్ అందించిన సేవలను కొనియాడారు. ఎంతో సమర్థత కలిగిన అధికారి పదవీ విరమణ చేస్తుండడం జిల్లా యంత్రాంగానికి ఎంతో లోటు అని అన్నారు. తన మొదటి పోస్టింగ్ భద్రాద్రి జిల్లాలో ట్రైనీ కలెక్టర్ గా ఇదివరకు కిరణ్ కుమార్ తో కలిసి పని చేశానని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తాను కలెక్టర్ గా కొనసాగుతున్న నిజామాబాద్ జిల్లాలో ఆయన పదవీ విరమణ చేయడం కాకతాళీయం అన్నారు. ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉండే రెవెన్యూ శాఖలో డీఆర్ఓగా, అదనపు కలెక్టర్ గా ఎంతో సమర్థంగా విధులు నిర్వహించారని, ప్రత్యేకించి నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, రెవెన్యూ శాఖా పరమైన అంశాలలో ఒత్తిడికి గురి కాకుండా ఓపికతో బాధ్యతాయుతంగా పని చేశారని కొనియాడారు. ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని, ముప్పై సంవత్సరాలకు పైగా వివిధ హోదాలలో ఎలాంటి రిమార్క్స్ లేకుండా సేవలు అందించడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. అనేక సందర్భాల్లో కుటుంబ సభ్యులతో సమయం గడిపే అవకాశం లేకుండా ఉద్యోగులు విధి నిర్వహణలో నిమగ్నం కావాల్సి వస్తుందని అన్నారు. పదవీ విరమణ చేస్తున్న అదనపు కలెక్టర్, వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. నచ్చిన వ్యాపకాన్ని ఎంచుకుని మానసిక ప్రశాంతతతో, కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకరమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు మాట్లాడుతూ, ఉన్నత హోదాలో కొనసాగినప్పటికీ ఉద్యోగాలతో కిరణ్ కుమార్ ఎంతో సౌమ్యంగా, స్నేహభావంతో మెలిగేవారని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో అదనపు కలెక్టర్ గా తాను సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూర్తి సహకారం అందించారని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మల్టీజోన్ ఐజీ

బాధితులతో మర్యాదగా, మాన వీయ దృక్పథంతో వ్యవహరించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవం తంగా వినియోగించి మెరుగైన పోలీసింగ్ అందించాలన్నారు. ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు అతిపెద్ద బలం. ప్రజల భద్రతే మా తొలి ప్రాధాన్యత అని ఐజీపీ అన్నారు.